# ఆనాడల్లా దిగులుగానే వుంది!

ధరణికోట శ్రీనివాసులు

★

"పర్సులోంచి రూపాయనోటు తీశావా?"

"అవును."

"యెందుకూ?"

"అవసరముండి."

"అవసరమైన వస్తువులల్లా తెచ్చిపెడ్తూనే వున్నాను గదా- మళ్ళీ యేం అవసరంకలిగింది."

"ఏమీ లేదండి, గాజులువేయించుకున్నాను."

"మొన్ననేకదూ వేయించుకున్నావు?"

"యేం చెయ్యమన్నారు, నిన్న అబ్బాయి స్కూలుకు పోనని ఒకటే అల్లరి పెట్టాడు. యెంత చెప్పినా విన్నాడు కాదు. ప్రాణం విసిగి నాలుగు అంటించేసరికి గాజులన్నీ బద్ధలయి నాయి."

"ఈ వెధవగాజులు నాలుగురోజులకొకసారి బద్దలవుతుంటే యేలాగేడుస్తుంది? నెలనెలకి అయిదు ఆరు రూపాయలు గాజులకే అవుతే భోజనం మాటేమిటి? యితర ఖర్చుల మాటే మిటి? వెధవసంసారం. యెలాగ్గడుస్తుందో?"

"అలాగ అనొచ్చండి వెధవగాజులని, యెంత అమంగళం. ముత్తైదువు గాజులదగ్గ రేనా మన సంసారపొదుపు. బోలెడంత డబ్బు సినిమాలకు పెట్టొచ్చు. నెలకు రెండుసార్లు హైద్రాబాదు వెళ్ళిరావచ్చు. కాఫీహోటళ్ళకు కావలసినంత ఖర్చుపెట్టవచ్చుకాని నేను గాజులు వేయించుకున్నానంటె మీకు ప్రాణంమీదికొస్తుం దేమిటి....?"

"పైగా ధర్మోపన్యాసాలు, మహాచులకనగా చెప్పేసెయ్యొచ్చు. పర్సులో రూపాయి తీసు కుంటె తీసుకున్నావు. తీసుకున్నానని చెప్ప కూడదూ?"

"అసలు నాకు జ్ఞాపకంలేదండీ....మరి మునిగి పోయిందేమిటి యిప్పుడు చెప్తూనే వున్నానుగా."

"మునిగిపోవడంగాదు. ప్రాణంపోయే అంత పని జరిగింది. యివ్వాళ్ళ-పర్సులో రూపాయ వుందనే నమ్మకంతో కాఫీహోటలుకు వెళ్ళాను. ఠీవిగా కూర్చొని రెండు యిడ్లీలు తెప్పించు కున్నాను. అదీ చాలక ఓ దోసె తెమ్మన్నాను. ప్లేటు శుభ్రంగా లేదని అయ్యరును తలవాచే టట్టు ఛీవాట్లు పెట్టాను. అచట వున్నవాళ్ళంతా హడలిపోయినారు. కాఫీనీళ్ళు నోట్లో పోసుకొని బిల్లు యిచ్చుకోవడానికి క్యాషియరువద్దకి వెళ్ళి పర్సుతీసిచూస్తే యేముంది?.........యేమీలేదు. గుండె గుభేలుమంది. మొహం తెల్లపడిపోయింది. గొప్ప మొనగానిలా యింత అల్లరీచేసి చివరకి పర్సులో రాగిదమ్మిడిలేని నా వెధవతనాన్నిచూచి ఆ ఛీవాట్లు తిన్న అయ్యరు, ఆ క్యాషియరు యెంత నవ్వుతారో అనుకున్నా. నవ్వడమేమిటి యిదే మంచి సమయమని ముక్కుకు మూదాడు వేసి గుంజుతారేమో అన్నభయంకూడా కల్గింది. యిక గత్యంతరంలేక కోటుజేబులు ఒక్కొక్కటి తడుముకోవడం మొదలెట్టాను - ఈ లోపున యేదో ఓ ఉపాయం ఆలోచించి అయ్యరుకు నచ్చచెప్పుదామని- నాలుగుజేబులు తడుముకునే వరకూ యే వుపాయమూ బుర్రకెక్కలేదు సరి కదా వంటినిండా చెమటలుక్రమ్మి నోటెంటమాట రావడమే కష్టమైపోయింది. నా అవస్థ చూచి ఆ క్యాషియరు యేమీ అనలేక, "డబ్బుయెక్కడో పారేసుకున్నట్టున్నారు," అన్నాడు.

"యిందాక ఆ బట్టలకొట్టుకి వెళ్ళానండీ. ఆ రష్‌లో యెవడో కొట్టేసి వుంటాడు" అని శుద్ధ అబద్ధం ఆడాను.

"డబ్బుకొట్టేసినవాడు పర్సుయెందుకు వదులు తాడు, దాన్నికూడా మాయంచేసేవాడు" అన్నాడు అయ్యరు.

'అయ్యరుమాట అటుంచు .... అచట వున్న నలుగురూ నాలుగు విధాల అడిగారు." మీరు యెన్నిగంటలకు యింటినుండి వెళ్ళారు? వెళ్ళే టప్పుడు పర్సు చూసుకున్నారా? యేదారినుండి వచ్చారు? మార్గంలో యెవరైనా కలిసి మాట్లా డారా? బట్టలకొట్టులో యేమైనా బట్టలుకొన్నారా? పర్సు కోటు లోపలిజేబులో పెట్టుకున్నారా" అని క్రాసుగా ప్రశ్నలు కురిపించారు. వీటి అన్నిటికి

ఆలోచించి యెన్నో అబద్ధాలు చెప్పాల్సొచ్చింది. నా అసహాయస్థితి చూచి పాపం అయ్యరు "సరే డబ్బు తర్వాత యెప్పుడైనా పంపండి" అన్నాడు. బ్రతుకు జీవుడా అని బయటపడ్డాను. నిజంగా యింత అవమానం నా జీవితంలో యెన్నడూ జరగలేదు. దీనికంతా కారణం నీవు. తెలివితక్కువపని చేసి నా సిగ్గును తీశావు...."

"బాగుంది గ్రహచారం, యిలాగ జరుగుతుందని నేనేం కలగన్నానా?" అంటూ వంటయింట్లోకి వెళ్లింది.

జరిగిన అవమానాన్ని తలుచుకొని వేడి నిట్టూర్పులు విడుస్తూ చాపమీద చదికిలపడ్డా, బయట ఆడుకుంటూవున్న పిల్లలంతా ఒక్కసారి వచ్చి నన్ను చుట్టేసుకున్నారు. "తమ్ముడు కొట్టాడని" పెద్దవాడు, "అన్నయ్య జుట్టు పీకాడని" చిన్నవాడు. "అమ్మ కొత్తింది" అని చిట్టి-ఫిర్యాదులు తెచ్చారు.

నేను యేమీ మాట్లాడకుండా కోపంగా వుండడం చూచికాబోలు ఒక్కరొక్కరే తిన్నగా వంటయింట్లోకి పరుగెత్తారు.

అది భోజనాలవేళవడంచేత పిల్లల్ని కూచోపెట్టి అన్నంపెట్టూవుంది తల్లి. మళ్లీ యేం జరిగిందో యేమో పిల్లలు పెద్ద అల్లరికిదిగి ఒకరిమీద ఒకరు యుద్ధం ప్రకటించుకున్నారు. సంధిచెయ్యడానికి తల్లి యెంతో ప్రయత్నంచేసిందికాని లాభం లేకపోయింది. కొంచెం గద్దాయించి వ్యవహారాన్ని పరిష్కారానికి తీసుకవద్దామని వంటింట్లోకి వెళ్లా. ఈ గోలలో చిట్టి ప్రక్కన్నే వున్న పెరుగు గిన్నెను తన్నేసింది. అర్థశేరు పెరుగు చుక్క లేకుండా కిందపడిపోయింది. యింకేముంది. మొదలే మొహం ముడుచుకొని కూచున్న మా ఆవిడ వరుసపెట్టి పిల్లలను బాదడం మొదలెట్టింది. ఈ బాదడంలో నిన్న వేసుకున్న గాజులు అన్నీ మళ్లీ బద్ధలయిపోయినాయి.

ఒళ్ళు చితికిపోయినందుకు పైకి పిల్లలు, నిన్న వేసుకున్న గాజులు బద్ధలయినందుకు తల్లి, మళ్ళీ ఓ రూపాయిగిరాకీ తగిలినందుకు నేను లోలోన యేడ్చుకున్నాం.

'గాజులూ' అని శంఖారవంవలె ధ్వనిచేస్తూ గాజులవాడు యెక్కడ ప్రత్యక్ష మవుతాడో అని ఆనాడల్లా దిగులుగావే వుంది.


# ఆనందవాణి

12, తంబుచెట్టి వీధి, మదరాసు_1

★

[ప్రచురణ : ప్రతి ఆదివారం]

సాలుచందా .... రు. 14/-
అర్థసంవత్సర చందా రు. 7-8-0

(తపాలు వ్యయంతో సహా)

★

★ అర్థసంవత్సరముకంటె తక్కువ కాలానికి చందా అంగీకరింపబడదు.

★ 'ఆనందవాణి' చందాదారులకు దీపావళి సంచిక ఉచితం.

## చందాదారులు

మాతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేటప్పుడు వారి చందాదారు నంబరు తప్పక తెలపవలెను. లేకుంటే జవాబు ఆలస్యమవుతుంది. మనియార్డర్లు "మేనేజరు, ఆనందవాణీ ఆఫీసు, 12 తంబుశెట్టివీధి, జి.టి. మద్రాసు" అని వ్రాయవలెను. వ్యక్తుల పేర పంపవద్దు.

—మేనేజరు.